# 6

# దీర్ఘశాంతము

ఆశ్చర్యకరమైన దేవుని స్వభావంలో మానవుల పట్ల దేవుడు కనుపరచు దీర్ఘశాంతం ఒకటి. ఆయన దీర్ఘశాంతము లేక ఓర్పు ప్రభువు తిరిగి ఇదివరకే ఎందుకు రాలేదో వివరిస్తుంది. "కొందరు ఆలస్యమని యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడు గాని యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు, మీ యెడల దీర్ఘశాంతముగలవాడై యున్నాడు" అని మనం చదువుతాం (2 పేతురు 3:9). నోవహు ఓడ సిద్ధపరచుచుండగా దేవుని దీర్ఘశాంతము కనిపెట్టియున్నట్టు కూడా పేతురు తెలిపాడు (1 పేతురు 3:20). దేవుని అనుగ్రహము ఆయన దీర్ఘశాంతము మారుమనస్సును పొందుటకు ప్రేరేపిస్తుందని పౌలు ప్రకటించాడు (రోమా 2:4). దీర్ఘశాంతము కలిగి ఉండడమంటే దేవుని స్వభావంలో పాలుపొందడమే. ఆత్మ ఫలములలో దీర్ఘశాంతము చేర్చబడిందంటే ఆశ్చర్యపడనవసరం లేదు (గలతీ. 5:22; KJV).

"దీర్ఘశాంతం" అంటే, "కోపపడక ముందు దీర్ఘ కాలం వేచియుండడమని అర్థం; ఓర్పు, సహింపు, ఓర్పుతో ఆలస్యం చేయు." ఇది క్రొత్త నిబంధనలో ఎక్కువ సార్లు "ఓర్పు" లేక "సహనము" అని తర్జుమా చేయబడింది.

## అది ప్రేమ ద్వారా పెరుగుతుంది

పౌలు గొప్ప ప్రేమ అధ్యాయాన్ని, 1 కొరింథీ. 13, వ్రాసినప్పుడు, ప్రేమలేనిది ఏదీ ప్రయోజనం కాదని తెలిపాడు (1–3 వచనాలు). వారి జీవితాల్లో ప్రేమ పుట్టించేవాటిలో సహనాన్ని అతడు మొదటిగా పేర్కొన్నాడు: "ప్రేమ దీర్ఘకాలము సహించును, దయ చూపించును, ప్రేమ మత్సరపడదు; ప్రేమ డంబముగా ప్రవర్తింపదు; అది ఉప్పొంగదు" (4 వ.). నీవు ప్రేమించే ప్రజల పట్ల ఓర్పుతో, దీర్ఘశాంతంతో ఉండడం ఎంత సులభమో కొంచెం ఆలోచించు. ప్రేమ మన అవలోకనాలను మార్చుతోంది!

మనం యితరులను ఎంతగా ప్రేమిస్తామో, వారియెడల దీర్ఘశాంతం గల హృదయాలను పెంపొందించుకొనడం అంత సులభం. అందువలననే కాబోలు సహోదరు లను ప్రేమించమని లేఖనాలు అంత తరచుగా బోధిస్తున్నాయి. మనలో ఒకరి పట్ల మరొకనికి ఉన్న ప్రేమను బట్టి లోకం మనలను క్రైస్తవులుగా గుర్తిస్తుందని ప్రభువు అన్నాడు (యోహాను 13:34, 35). "సహోదర ప్రేమ నిలువరముగా ఉండనియ్యుడని" మనం చెప్పబడ్డాం (హెబ్రీ. 13:1). "సహోదరులను ప్రేమించుడి" అని పేతురు తెలిపాడు (1 పేతురు 2:17బి). ప్రేమ దీర్ఘకాలం సహించితే, మనం సహోదరులను ఎంతగా ప్రేమిస్తున్నామంటే – ఒకరి యెడల ఒకరికి దీర్ఘశాంత స్వభావం కలిగియుండాలని

అర్థం. ఒకరితో నొకరం త్వరగా కోపపడకుండ ఉండాలి.

## అది ఐక్యతను ఉత్పత్తి చేస్తుంది

ఐక్యత సంఘంలో అతి ప్రాముఖ్యమైనది. యోహాను 17లో ప్రభువైన యేసు మన ఏకత్వం కొరకు ప్రార్థించాడు. ఆయనను దేవుడు పంపినట్టు లోకం నమ్మాలంటే ఆయన, తండ్రి ఎలా ఏకమైయున్నారో, ఆయనయందు మనమును అలాగే ఏకమైయుండాలని ఆయన ప్రార్థించాడు (యోహాను 17:20, 21). సంఘం ఏకత్వాన్ని ఎలా కలిగి యుంటుంది? మనమందరం ప్రతిదాన్ని ఎల్లప్పుడు ఒకే విధంగా చూడలేం. ప్రజలు తమకొరకు తామే ఆలోచన చేసికొన్నంత కాలం, వారు వేరైన తీర్మానాలకు వచ్చి చేరుకుంటారు. – దేవుని ఆయన వాక్యాన్ని గాఢంగా ప్రేమించేవారు సయితం అలా చేస్తారు. అప్పుడు ఏకత్వం ఎలా ఉంటుంది? పౌలు ఈ ప్రశ్నకు ఎఫెసీ. 4:1–3లో జవాబిచ్చాడు:

> కాబట్టి, మీరు సమాధానమను బంధముచేత **ఆత్మ** కలిగించు ఐక్యమును కాపాడు కొనుటయందు శ్రద్ధ కలిగినవారై, ప్రేమతో ఒకనినొకడు సహించుచు, మీరు పిలువబడిన పిలుపునకు తగినట్లుగా దీర్ఘశాంతముతో కూడిన సంపూర్ణ వినయముతోను సాత్వికముతోను నడుచుకొనవలెనని, ప్రభువును బట్టి ఖైదీనైన నేను మిమ్మును బతిమాలుకొనుచున్నాను.

క్రైస్తవుని యొక్క యోగ్యమైన నడకలో భాగంగా ప్రేమతో ఒకని నొకడు సహించుచు, దీర్ఘశాంతముతో కూడిన సంపూర్ణ వినయము, సాత్వికము కలిగియుండాలి.

ఏకత్వపు నిర్మాణానికి ఆధారమైన ఏడు “ఒకట్లను” గూర్చి చెప్పక ముందు, ఐక్యతను సాధించడానికి అవసరమైన హృదయాలు కలిగియుండాలని పౌలు తెలియజేశాడు. క్రైస్తవ్యం యొక్క ప్రాథమిక సిద్ధాంతాల మీద అంగీకారం అతి ప్రాముఖ్యమైనదైయుంది. కాని సిద్ధాంతాలు సరిగా ఉన్నా, మన హృదయాలు లేక స్వభావాలు సరిగా ఉండనట్ట యితే, అవి ఐక్యతను పుట్టించవు. మన సొంత పోరాటాల్లో మన పట్ల యితరుల ఓర్పు, దీర్ఘశాంతము ఎంత అవసరమో, మంచి చేయడానికి కృషి చేసేవారిపట్ల మనం కూడా ఓర్పుగాను, దీర్ఘశాంతముగాను ఉండడం అంత అవసరం.

## అది క్షమాపణను ప్రోత్సహిస్తుంది

దీర్ఘశాంతముగల హృదయం క్షమించే స్వభావాన్ని పుట్టిస్తుంది. కొలస్సీ. 3:12, 13లో పౌలు యిలా వ్రాశాడు:

> కాగా, దేవునిచేత ఏర్పరచబడినవారును పరిశుద్ధులును ప్రియులునైనవారికి తగినట్లు, మీరు జాలిగల మనస్సును, దయాళుత్వమును, వినయమును, సాత్వికమును, దీర్ఘశాంతమును ధరించుకొనుడి. ఎవడైనను తనకు హానిచేసెనని యొకడనుకొనిన యెడల ఒకనినొకడు సహించుచు ఒకని నొకడు క్షమించుడి, ప్రభువు మిమ్మును క్షమించిన లాగున మీరును క్షమించుడి.

మనలను క్షమించడానికి దేవుడు ఎంతగా యిష్టపడతాడు? సంపూర్ణంగా! “మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగినవాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతినుండి మనలను పవిత్రులనుగా చేయును” (1 యోహాను 1:9). ప్రభువు మనలను సంకోచంగా కాదు, సమృద్ధిగానే క్షమిస్తాడు. ప్రభువైన యేసు దుమ్ముతో కూడిన పాలస్తీనా వీధులగుండా నడిచిపోతూ క్షమించడానికి దేవుడు ఎంత సంసిద్ధుడైయున్నాడో వివరించాడు. స్వస్థత పొందగోరి జనులు ఆయన వద్దకు వచ్చినప్పుడు, క్షమాపణ కొరకు వారు అడగనప్పుడు సయితం, “నీ పాపములు క్షమింపబడినవి” అని ఆయన అనేవాడు.

ఇతరుల యొక్క భావాలు, అభిప్రాయాల పట్ల ఎల్లవేళలా దయగలిగి ఓర్పు కలిగి ఉన్నట్టయితే మన జీవితాల్లోను మరియు సంఘమంతటిలోను ఏమి జరుగుతుందో ఊహించి చూడు. మనం అభ్యంతరాలను త్వరగాను సులభంగాను క్షమించగలుగుతాం. నిత్యత్వపు ఫలితాలకు సంబంధించని విషయాలలోని వ్యత్యాసాలను మనం చూచి చూడనట్టు ఉండిపోతాం. గెలుపొందు సమాధానం చూడ యింపుగా ఉంటుంది!

## అది సహనానికి దారి చూపుతుంది

దేవుని సేవలోని ఓర్పు, దీర్ఘశాంతాలను గూర్చి క్రొత్త నిబంధన కూడా మాట్లాడు తోంది. క్రైస్తవులుగా మనం వదలిపెట్టడాన్ని నిరాకరించాలి – సేవలో మనకు వచ్చే శోధనలు ఎంత కష్టతరమైనవైనా సరే. యాకోబు 5:10, 11 యిలా అంటుంది:

> నా సహోదరులారా, ప్రభువు నామమున బోధించిన ప్రవక్తలను, శ్రమానుభవము నకును ఓపికకును మాదిరిగా పెట్టుకొనుడి. సహించినవారిని ధన్యులనుకొనుచున్నాము గదా? మీరు యోబు యొక్క సహనమునుగూర్చి వింటిరి. ఆయన ఎంతో జాలియు కనికరమును గలవాడని మీరు తెలిసికొనియున్నారు.

యోబు సహనమునకు మాదిరియైయున్నాడు. ఎందుకు? అతడు ప్రతిదానిలో దూర దూరంగా అంగలు వేసి నడిచినందుకా? లేదు! కీడు తనమీదికి ఎందుకు వచ్చిందో అతడు గ్రహించలేకపోయాడు అది అన్యాయమని అతడు తలంచాడు. తన బాధయంతటిని బట్టి అతడు దేవుని వివాదానికి పిలిచాడు. యోబు యొక్క ఓర్పు లేక సహనము వచ్చి, జీవితం ఎంత కష్టతరంగా మారినా అతడు దేవుని వద్దనుండి ఎన్నడూ వెనుకకు తిరగలేదు.

2 కొరింథీ. 4:8–10లో పౌలు తన సొంత జీవితాన్ని గురించి వర్ణించినప్పుడు, అతడిలా అన్నాడు: “ఎటుబోయినను శ్రమపడుచున్నను ఇరికింపబడువారము కాము; అపాయములో నున్నను కేవలము ఉపాయము లేనివారము కాము; తరుమబడు చున్నను దిక్కులేనివారము కాము; పడద్రోయబడినను నశించువారము కాము ...” క్రైస్తవ జీవితం పౌలుకు తేలికైనది కాదు. అయితే అంతం వచ్చినప్పుడు అతడిలా చెప్పగలిగాడు:

> మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడముట్టించితిని, విశ్వాసము కాపాడు కొంటిని. ఇకమీదట నా కొరకు నీతి కిరీటముంచబడియున్నది. ఆ దినమందు నీతిగల న్యాయాధిపతియైన ప్రభువు అది నాకును, నాకు మాత్రమే కాకుండ తన ప్రత్యక్షతను అపేక్షించు వారికందరికిని అనుగ్రహించును (2 తిమోతి 4:7, 8).

ప్రభువుకు తాము చేసే సేవను వదలుకొనడానికి ప్రజలు అనేక కారణాలను యిచ్చారు. క్రైస్తవ జీవితం దుర్భలమైన హృదయులకు కాదు. దీర్ఘకాలం ప్రభువు కొరకు శ్రమపడడానికి యిష్టపడి ఎప్పటికిని విడిచిపెట్టని వారికే ఆ జీవితం.